

భలే మంచు రోజు

జిల్లాను శనివారం పొగమంచు కమ్మేసింది. చలిపులి వణికించింది. ఉదయం 9 గంటల వరకూ దట్టమైన పొగమంచుతో రోడ్లు కనపడక వాహనదారులు అవస్థలు పడ్డారు. - 8లో..



సైనికుల సేవలు గర్వకారణం

దేశ రక్షణలో సైనికుల సేవలు గర్వకారణమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31/24

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

9న ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్తంగా ఈ నెల 9వ తేదీ ఒంగోలు ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జే రవితేజ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో కాన్వజీనియస్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్, రే న్యూస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హావెల్స్ రామచంద్ర మెగా ఫర్నిచర్ మాల్, కోల్గెట్ పామోలివ్, రవిలీలా గ్రానైట్స్ తదితర కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లాకు చెందిన 19 నుంచి 30 సంవత్సరాల మధ్య ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకూ వేతనం ఇస్తారన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు పాన్ కార్డు, ఆధార్‌కార్డు, ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఈ విద్యా సాగర్ 7989244381 నంబరు పై సంప్రదించాలన్నారు.

మధ్యవర్తిత్వంతో సమస్యల పరిష్కారం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు

ఒంగోలు: మధ్యవర్తిత్వం విధానంతో కక్షిదారులు ఇద్దరూ సమస్యను పరిష్కరించుకోవచ్చని, న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిని నియమిస్తారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు అన్నారు. స్థానిక జిల్లా న్యాయస్థానం ఆవరణలోని బార్ అసోసియేషన్ హాలులో శనివారం న్యాయవాదులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ ప్రక్రియ ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్టేనని, న్యాయస్థానాల్లో చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి పొందవచ్చన్నారు. మధ్యవర్తిత్వానికి రిఫరల్ జడ్జిగా వ్యవహరించేవారు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారని, అదే సమయంలో మానవత్వాన్ని కూడా పరిగణలోనికి తీసుకుని ఇరు వర్గాలతో చర్చించి వారి ఆమోదంతోనే కేసు పరిష్కారానికి కృషిచేస్తారన్నారు. ఈనెల 14వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయస్థానాల్లో పెండింగ్ లో ఉన్న కేసుల పరిష్కారం కోసం, ప్రీ లిటిగేషన్ స్థాయిలో కేసుల పరిష్కారానికి కక్షిదారులు ముందుకు రావాలని అన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి షరీఫ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్ దాస్ పాల్గొన్నారు.

మెగా లెక్క తప్పింది..

పేరుకే మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాల లెక్క తప్పింది. జిల్లా అంతటా ఈ కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. అతిథుల ఊకదంపుడు ఉపన్యాసాలు మినహా విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించి సమావేశాల్లో చర్చకు రాకపోవడం గమనార్హం. నెలరోజులుగా కసరత్తు చేసినా సమావేశాలకు తల్లిదండ్రుల హాజరు 50 శాతం కూడా దాటలేదు. పాఠశాలల్లో పూలు, మామిడి తోరణాలు కట్టి..టెంట్లు, కుర్చీలు వేసి హడావుడి చేశారేతప్ప విద్యార్థులకు ఒనగూడిందేమీ లేదు. పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలంటూ అధికార పార్టీ నేతలు ప్రకటనలు చేయడం కొసమెరుపు.

- మొక్కుబడిగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం
- అతిథులు, నేతల ఊకదంపుడు ఉపన్యాసాలు
- విద్యార్థుల భవిష్యత్‌పై చర్చ శూన్యం
- అంతంత మాత్రంగా తల్లిదండ్రులు రాక
- జిల్లా వ్యాప్తంగా 50 శాతం దాటని వైనం
- చాలా ప్రాంతాల్లో 20 శాతం మాత్రమే హాజరు
- స్పష్టమైన ప్రభుత్వంపై వ్యతిరేకత

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా 2407 స్కూళ్లలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు తూ తూ మంత్రంగా సాగాయి. ఈ సమావేశాల్లో ఎటువంటి పథకాలు కానీ, పాఠశాల అభివృద్ధికి చెందిన సంస్కరణలు కానీ ప్రకటించకపోగా ప్రభుత్వ పెద్దలను కీర్తించేందుకే సరిపోయింది. ఎమ్మెల్యేలు, కూటమి నాయకుల ప్రసంగాలతో హోరెత్తించి విద్యార్థులకు విసుగుతెప్పించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలను ప్రభుత్వం పక్కన పెట్టింది. స్కూళ్ల అభివృద్ధికి చేపట్టిన నాడు–నేడు పనులను అటకెక్కించింది. అలాగే పేద విద్యార్థుల కోసం అమలు చేసిన అమ్మఒడి (ప్రస్తుతం తల్లికి వందనం), ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను, సీబీఎస్‌సీ సిలబస్‌ను, టోఫెల్‌ను రద్దుచేసింది. దీంతో ఆరునెలల్లోనే ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురైంది. దీనిని కప్పిపుచ్చుకునేందుకు నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాల్లో కూటమి ప్రభుత్వం విద్యారంగానికి చేస్తున్న అభివృద్ధిని తల్లిదండ్రులకు వివరించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు అవస్థలు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఇదే తీరుగా సాగాయి. ఈ సమావేశాలకు ప్రోటోకాల్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ చైర్మన్ నుంచి స్థానిక ఎంపీపీ, జెడ్పీటీసీ, వార్డు మెంబర్, కౌన్సిలర్లు, దాతలు ఇలా వారి పాఠశాల పరిధిలోని పలువురు అతిథులను ఆహ్వానించారు. ఈ సమావేశాలను విజయవంతం చేసేందుకు నెల రోజులుగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, టీచర్లు కష్టపడినా విద్యార్థుల తల్లిదండ్రుల హాజరు మాత్రం సరాసరి 50 శాతం దాటకపోవడం ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందన్న వ్యాఖ్యలు వినిపించాయి.

జిల్లా కేంద్రంలో ఎస్పీ ఏఆర్ దామోదర్, కొండపి నియోజకవర్గంలో మంత్రి బాలవీరాంజనేయ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో కలిపి మొత్తం 73 హైస్కూళ్లు, 12 యూపీ స్కూళ్లు 177 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన సమావేశాలకు తల్లిదండ్రుల సంఖ్య 30 శాతం నుంచి 40 శాతానికి మించకపోవడంతో ప్రధానోపాధ్యాయులతో పాటు టీచర్స్ అవాక్కయ్యారు. ప్రభుత్వం ప్రతి ఏటా బడులు ప్రారంభించే సమయానికి తల్లుల బ్యాంక్ ఖాతాల్లో అమ్మ ఒడి నగదు జమయ్యేది. కానీ ఈ సంవత్సరం పాఠశాలలు తీసి ఇప్పటికి 7 నెలలు కావస్తున్నా మరో నాలుగు నెలల్లో విద్యాసంవత్సరం కూడా ముగుస్తున్నా ప్రభుత్వం 'తల్లికి వందనం' పేరుతో ప్రకటించిన రూ.15 వేలను వేయకపోవడంతో తల్లిదండ్రుల్లో పూర్తిగా అసంతృప్తి నెలకొంది. ఇదే మెగా పేరెంట్స్ సమావేశానికి హాజరు కాకపోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. వచ్చిన వారిలో కొంత మంది తల్లిదండ్రులు 'తల్లికి వందనం' డబ్బులు ఎప్పుడు పడతాయని స్థానికంగా ఉన్న టీచర్లను ఆరా తీయటంతో వారు ఏం చెప్పాలో తెలియక ఇబ్బంది పడ్డారు. దర్శి నియోజకవర్గంలోని దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, దొనకొండ, కురిచేడు మండలాల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. నియోజకవర్గంలో 325 పాఠశాలలు ఉండగా 1293 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థులు, వారు పిలిచిన ప్రజా ప్రతినిధులు హాజరయ్యారే తప్ప తల్లిదండ్రులు మాత్రం సమావేశాలకు హాజరు కాకపోవడం పై ప్రభుత్వ వ్యతిరేకతను స్పష్టం చేస్తోంది. విద్యార్థుల్లో 20 శాతం తల్లిదండ్రులు కూడా హాజరు కాకపోవడం గమనార్హం. కురిచేడు మండలంలో 58 పాఠశాలలుండగా కేవలం మూడు నాలుగు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పదుల సంఖ్యలో వచ్చారు. మిగతా పాఠశాలల్లో ఇద్దరు, ముగ్గురుతో సరిపెట్టుకోగా, కొన్ని పాఠశాలల్లో కేవలం ఫొటోలకు మాత్రమే గ్రామస్తులను పిలిచి ఫొటోలు తీసి పంపించి వేశారు.



కురిచేడు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పేరంట్స్ రాక ఖాళీగా ఉన్న కుర్చీలు

ఆర్భాటమే కానీ స్పందన కరువే..

కనిగిరి నియోజకవర్గ సమావేశాల్లో ఆర్భాటమే కానీ ఎక్కడా పూర్తి స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కాలేదు. పేరెంట్స్ నుంచి స్పందన కరువవడంతో అప్పటికప్పుడు అధికార టీడీపీ నేతలు విద్యార్థుల ఇళ్ల వైపు పరుగులు తీయాల్సి వచ్చింది. నియోజకవర్గంలో 462 స్కూళ్లు, 27,420 మంది విద్యార్థులు ఉన్నారు. కానీ పిల్లలకు తగ్గట్టు వారి తల్లిదండ్రులు ఎవరూ హాజరు కాలేదు. సరాసరి 50 శాతం మంది తల్లిదండ్రులు హాజరయ్యారు.

నిరుత్సాహంగా సమావేశాలు

కొండపి నియోజకవర్గంలో ఈ సమావేశాలు నిరుత్సాహంగా సాగాయి. ఈ మీటింగులపై తల్లిదండ్రులు ఆసక్తి చూపలేదు. ఒక పక్క పొలం పనులు ముమ్మరంగా సాగుతుండటంతో తల్లిదండ్రులు వాటికే ప్రాధాన్యత ఇచ్చారు తప్ప సమావేశం గురించి పట్టించుకోలేదు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కొన్ని మండలాల్లో అయితే కేవలం 10 నుంచి 20 శాతం మంది మాత్రమే హాజరుకాగా, కొన్ని మండలాల్లో 30 నుంచి 40 శాతం మంది మాత్రమే తల్లిదండ్రులు హాజరయ్యారు. అంతేకాక సమావేశానికి వచ్చిన అధికారులు ఈవ్‌టీజింగ్, చట్టాలపై అవగాహన కల్పించారే తప్ప మీ పిల్లలు బాగా చదువుతున్నారా, చదవకపోతే ఎందుకు బాగా చదవటం లేదు అన్న దానిపై చర్చ జరగలేదు. కేవలం ప్రభుత్వ ప్రచార ఆర్భాటం తప్ప ఒరిగిందేమీ లేదని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. మార్కాపురం నియోజకవర్గంలో మొత్తం 283 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. శనివారం పేరెంట్సు టీచర్స్ సమావేశానికి సగటున 60 శాతం మంది మాత్రమే తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సమావేశంలో హాజరైన అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ గొప్పలు వివరించేందుకే సమయం సరిపోవడంతో తల్లిదండ్రులు విసుగు చెందారు. గిద్దలూరు నియోజకవర్గంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత , ఉన్నత పాఠశాలలు 345 ఉన్నాయి. చాలా పాఠశాలల్లో సరాసరి 40 శాతం మంది తల్లిదండ్రులు వచ్చారు.



650 మందికి పైగా విద్యార్థులున్న సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూలులో హాజరైన తల్లిదండ్రుల సంఖ్య కేవలం 50-60 మంది లోపే

హామీలు నెరవేర్చాలి

- తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి
- తల్లిదండ్రుల సమావేశంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి

త్రిపురాంతకం: ఎన్నికలకు ముందు కూటమి నేతలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. హామీలు అమలు కాకుంటే, తల్లికి వందనం తల్లులకు అందకుంటే వచ్చే నెల నుంచి ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నా ఇంత వరకు వాటిని భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేసి ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. ఈ సంవత్సరం పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.25 వేల నగదు బహుమతులు ఇస్తానని ఆయన విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అనంతరం మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఏపీఆర్ఎస్ గణపవరం, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ దూపాడు, కేజీబీవీ పాఠశాలల్లో పేరెంట్స్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ పి.లక్ష్మి, డిప్యూటీ డీఈవో శామ్యూల్‌జాన్, ఎంఈవో తులసి మల్లికార్జున నాయక్, హెచ్‌ఎం శ్రీనివాసులు, ఎంపీటీసీ మోహన్‌దాసు, చైర్మన్ హైమావతి పాల్గొన్నారు.

అసౌకర్యాలపై ఆగ్రహం



పాఠశాలలో సౌకర్యాలపై మాట్లాడుతున్న విద్యార్థి తండ్రి

త్రిపురాంతకం: మండల పరిధిలో గణపవరం గ్రామం ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో మౌలిక సౌకర్యాలు సక్రమంగా లేవని విద్యార్థుల తల్లిదండ్రులు పేరెంట్స్ కమిటీ సమావేశంలో శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. మెరిట్ విద్యార్థులు చదివే ఏపీఆర్ పాఠశాలగా రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు లేకపోవడం బాత్‌రూము, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయంటూ మండిపడ్డారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు నివాసం ఉంటే ప్రదేశాల్లో సైతం ఫ్లోర్ సక్రమంగా లేకపోవడం, బల్బులు, ఫ్యాన్లు సక్రమంగా పని చేయడంలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేసి అన్ని సౌకర్యాలతో అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి పాఠశాల సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు అవసరమైన నిధులు మంజూరు చేసి బాత్ రూములు, మరుగుదొడ్ల నిర్మాణం చేయడంతో పాటు గదులలో విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు, ఇతర సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

గంజాయి, తాగుబోతులను తీసుకోవడం లేదు..





మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత, సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే జనార్దన్, ఎంపీ మాగుంట, కార్పొరేటర్లు

- తొలగించిన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవడంపై ఎమ్మెల్యే దామచర్ల వివాదాస్పద వ్యాఖ్యలు
- వెధవలకు పాతిక వేలు ఇచ్చే బదులు అనుభవజ్ఞుడికి రూ.లక్ష ఇచ్చినా నష్టం లేదంటూ కామెంట్స్
- వాడివేడిగా నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం
- బలంగా ప్రజల గొంతు వినిపించిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు
- షాదీఖానా ప్రైవేటీకరణ ప్రయత్నాలను తిప్పికొట్టిన ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్

ఒంగోలు టౌన్: ''మనం తాగుబోతులను, గంజాయి తాగేవారిని తీసుకోవడం లేదు. ఎవరో ఒక వెధవకు పాతిక వేలు ఇవ్వడానికి బదులు ఒక అనుభవజ్ఞుడికి రూ.లక్ష, రూ.లక్షన్నర ఇచ్చి సలహాదారుడిగా పెట్టుకున్నా నష్టం లేదు'' అని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ శనివారం ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. నగర పాలక సంస్థలో ఏళ్లతరబడి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, మేస్త్రీలను విధుల నుంచి అక్రమంగా తొలగించి.. ఒక రిటైర్డ్ అధికారిని లక్షలు వెచ్చించి సలహాదారుడిగా నియమించేందుకు మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. ఆయన నియామక ప్రతిపాదనపై వైఎస్సార్ కాంగ్రెస్ నుంచి ఇటీవల టీడీపీలో చేరిన డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు అభ్యంతరం తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవద్దని కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, పాలక వర్గం ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని సలహా ఇచ్చారు. దానికి ఎమ్మెల్యే దామచర్ల తీవ్రంగా స్పందించారు. అవసరమైతే రిటైర్డ్ కమిషనర్‌తోపాటుగా ఒక అసిస్టెంట్ కమిషనర్‌ను కూడా తీసుకోండి, నేను ముఖ్యమంత్రితో మాట్లాడి ఉత్తర్వులు తెస్తానంటూ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థలో 900 మంది పారిశుధ్య కార్మికులు మస్టర్లు వేస్తున్నారని, వారిలో కేవలం 400 మంది మాత్రమే పనులు చేస్తున్నారని, మిగతా వారు పనులు ఎగ్గొట్టి రాజకీయ పార్టీలతో అంటకాగుతూ తిరుగుతున్నారని విమర్శించారు. ఎవరెవరు మస్టర్లు వేస్తున్నారో, ఎవరెవరు ఎంతెంత జీతాలు తీసుకుంటున్నారో లిస్టు చదివి వినిపిస్తానంటూ చెప్పడం దుమారం రేకెత్తించింది. కార్పొరేషన్ పరిధిలో 70 సచివాలయాలు ఉన్నాయని, మేస్త్రీలను సూపర్‌వైజర్ల కింద పెడుతున్నాం, పనులు చేసే వారే ఉంటారు లేకపోతే తీసేయండని కమిషనర్‌ను ఆదేశించారు. శానిటేషన్ విభాగంలో చాలా మంది పాతుకొని పోయారని అసహనం వ్యక్తం చేశారు. తన ప్రసంగం అడుగడుగునా పారిశుధ్య కార్మికులు, మేస్త్రీల మీద అక్కసును ప్రదర్శించారు. వ్యక్తిగత విమర్శలు చేస్తూ అసహనం వ్యక్తం చేశారు.

షాదీఖానా వ్యాపార సంస్థ కాదు:



మాట్లాడుతున్న ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్

నిరుపేద ముస్లింల కోసం నిర్మించిన షాదీఖానాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి పైసలు వసూలు చేసేందుకు పాలక వర్గం చేసిన ప్రయత్నాలను వైఎస్సార్ సీపీ కార్పొరేటర్, ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్ సమర్థవంతంగా తిప్పికొట్టారు. షాదీఖానాను లీజుకు ఇచ్చి నెలవారీ అద్దెను నిర్ణయించేందుకు గాను రెవెన్యూ విభాగానికి స్వాధీనం చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఆర్థికంగా వెనకబడిన నిరుపేద, సామాన్య ముస్లింల కోసం వైఎస్సార్ సీపీ హయాంలో షాదీఖానా నిర్మించారని, ఇది వ్యాపార సంస్థ కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఈ అంశాన్ని కౌన్సిల్ వాయిదా వేసింది.

పనులు చేసిన తరువాత టెండర్ ...

నగరంలో ప్రధాన రహదారులన్నీ గుంతలు పడిపోయి ఉన్నాయి. మరమ్మతులు చేయమని అడుగుతుంటే నిధులు లేవంటూ ఒట్టి చేతులు చూపిస్తున్న నగర పాలకులు ప్రజల మౌలిక అవసరాలతో సంబంధంలేని డివైడర్లకు రంగులు వేసిన తరువాత నిబంధనలకు వ్యతిరేకంగా టెండర్ వేసి ఆమోదించుకున్నారు. నగరంలో జరుగుతున్న పనులన్నింటినీ ఒకే వ్యక్తికి కట్టబెట్టడమే కాకుండా ఏకంగా రూ.40 లక్షలను మంజూరు చేస్తూ కౌన్సిల్‌లో ఆమోదం తెలపడంతో విపక్ష కార్పొరేటర్లు మండిపడుతున్నారు. అధికారుల వద్ద ఉండాల్సిన ఎంబుక్‌లు కౌన్సిల్ సమావేశం వద్ద ఓ టీడీపీ నాయకుడి చేతుల్లో కనిపించడం విమర్శలకు తావిచ్చింది.



అధికారుల దగ్గర ఉండాల్సిన ఎంబుక్‌లు టీడీపీ నాయకుడి చేతుల్లో ఇలా..

చెత్త పన్నుపై ద్వంద్వ వైఖరి తగదు...

చెత్త పన్ను రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దొడ్డిదారిన ప్రజలపై భారం వేసేందుకు ప్రయత్నిస్తోందని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ విమర్శించారు. జనరల్ ఫండ్ నుంచి పన్నులకు డబ్బులు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. జనరల్ ఫండ్ ప్రజల నుంచి వసూలు చేసిందేనని తేల్చి చెప్పారు. అవసరమైతే ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులపై కక్ష సాధింపు చర్యలు తగదని హితవుపలికారు. టీడీపీ నాయకులు పలువురు కౌన్సిల్ సమావేశంలో కూర్చోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

కార్మిక సంఘం నిరసన...

నగర పాలక సంస్థలో పనిచేస్తున్న మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలని, 5 నెలలుగా బకాయిపడిన కార్మికుల వేతనాలను వెంటనే చెల్లించాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సమావేశం జరుగుతున్నంత సేపూ నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్మికులపై రాజకీయ వేధింపుల ఆపాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు టి.విజయమ్మ, కొర్నెపాటి శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, ఐజాక్, శేఖర్, సాయి, ఆదినారాయణ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

సింగరాయకొండ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఇందు కోసం సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి స్వామి మాట్లాడుతూ ఆడపిల్లలు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఉపాధ్యాయుల పనితీరును బట్టి పాఠశాలలకు రేటింగ్ ఇస్తున్నామని, ఎప్పటికప్పుడు రేటింగ్ అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధించే లక్ష్యంగా పనిచేయాల్సి ఉందని, ఇందుకోసం పేరెంట్స్ మీటింగులు ఏర్పాటు చేసి మీరిచ్చిన సూచనలు అమలు చేస్తామని వివరించారు. మొదట విద్యార్థులు, పేరెంట్స్‌తో మాట్లాడి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. తరువాత బాత్‌రూమ్‌లను స్వయంగా తనిఖీ చేశారు. పాఠశాలకు ఆటస్థలం లేదని, పక్కనే రైల్వే స్థలం ఖాళీగా ఉందని, దానిని ఆటస్థలంగా వాడుకోవటానికి కృషి చేయాలని మంత్రి స్వామి కలెక్టర్‌కు సూచించారు. తరువాత సుందర్ నగర్ ప్రాథమిక పాఠశాలను మంత్రి స్వామి పరిశీలించారు. డీఈఓ రవికుమార్, హెచ్‌ఎం మహాలక్ష్మి, తహశీల్దార్ టీ రవి, ఎంపీడీవో డీ జయమణి, ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు, ఆవుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

దళితుల భూములపై పచ్చనేత కన్ను

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

మద్దిపూడి: మా భూములు అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని, పట్టాదారు పాస్‌పుస్తకానికి దరఖాస్తు చేసుకున్నారని, తిరిగి మా భూములు మాకు ఇప్పించాలంటూ మండలంలోని రావిళ్లవారిపాలెం గ్రామ దళితులు, గ్రామ రైతులు జువ్విగుంట గ్రామ సచివాలయం వద్ద శనివారం ధర్నాకు దిగారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రావిళ్లవారిపాలెం గ్రామానికి చెందిన దళితులు పులగం చినపరదేశి, పులగం నర్సమ్మలకు ముగ్గురు కుమారులు పెదకోటయ్య, చినకోటయ్య, బాలకోటయ్య ఉన్నారు. చిమట రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 727లో 1.63 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి అన్నదమ్ముల మధ్య పంపకాలు కుదరక వదిలేయడంతో బీడుభూమిగా ఉంది. అయితే ఆ భూమిని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పాలెపు రమణయ్య తన కుమారుడైన పాలెపు తిరుపతినాయుడు పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడు. అలాగే పులగం పెదకోటయ్య పేరుతో ఉన్న సర్వే నంబరు727–19లో 1.88 ఎకరాల భూమిని సైతం రెవెన్యూ అధికారుల సహకారంతో తిరుపతి నాయుడు పేరుతో ఆన్‌లైన్ ఎక్కించుకున్నాడు. అదేవిధంగా చిమట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 740–3లో సాలనా చెన్నమ్మ పేరుతో ఉన్న 0.92 ఎకరాల భూమితోపాటు మరో కొందరు దళితుల భూమి సుమారు 5 ఎకరాలని పాలెపు రమణయ్య కుమార్తె పాలెపు ప్రశాంతి పేరుతో ఎక్కించుకున్నాడు. అలాగే పాలెపు పుష్పాలు పేరుతో ఉన్న సర్వే నంబరు 717లో 2.88 ఎకరాల భూమి, యర్రజొన్న చినబ్రహ్మయ్య పేరుతో ఉన్న సర్వే నంబరు 727–18లో 1.30 ఎకరాల భూమి రమణయ్య భార్య అయిన పాలెపు పద్మ పేరుతో ఆన్‌లైన్ ఎక్కించుకున్నాడు. ఇది ఇలా ఉంటే రావిళ్లవారిపాలెం గ్రామానికి చెందిన పాలెపు రమణయ్య, లక్ష్మీనర్సయ్య, శ్రీనులు అన్నదమ్ములు. వారి తల్లి పాలెపు రాగమ్మ పేరుతో జువ్విగుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 118 2సీ3లో 0.43 సెంట్ల భూమి ఉంది. తన తల్లి అయిన రాగమ్మను తాను సాకుతున్నానని నాకు రావాల్సిన భూమి నాకు, నా తల్లికి తెలియకుండానే అన్న అయిన పాలెపు రమణయ్య అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని ఆయన కుమారుడైన పాలెపు తిరుపతినాయుడుకు రిజిస్ట్రేషన్ చేశాడని మూడో తమ్ముడు పాలెపు శ్రీను వాపోయాడు. దీంతో స్థానిక జువ్విగుంట సచివాలయం వద్ద శనివారం టెంటువేసి దళితులు, వృద్ధురాలు అయిన రాగమ్మ ధర్నాకు దిగారు. సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదనివారు వాపోయారు. న్యాయం జరిగేంత వరకు ధర్నా ఇలాగే కొనసాగిస్తామని బాధితులు తెలిపారు.

ఈ విషయం పై స్థానిక తహశీల్దార్ జ్వాల నర్సింహారావును 'సాక్షి' వివరణ కోరగా... దళితుల భూములు, అన్నదమ్ముల భూముల ఆక్రమణ వ్యవహారం గతంలో ఇక్కడ పనిచేసిన డిప్యూటీ తహశీల్దార్ సహకారంతో పాలెపు రమణయ్య అనే వ్యక్తి ఆన్‌లైన్ చేయించుకున్నట్లు తెలిసిందన్నారు. బాధితులు ముందుకొచ్చి వినతిపత్రం ఇస్తే గ్రామంలోకి వచ్చి విచారించిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



జువ్విగుంట సచివాలయం వద్ద టెంటువేసి ధర్నాకు దిగిన బాధితురాలు పాలెపు రాగమ్మ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మహిళ మృతి


మృతిచెందిన కాశమ్మ

బేస్తవారిపేట: విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని మోటుపల్లి గ్రామంలో శనివారం జరిగింది. మోటుపల్లికి చెందిన కాటుబోయిన కాశమ్మ, ఆవులయ్య దంపతులు తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో ఉంటున్నారు. గుర్రప్పడి పూజ కోసం స్వగ్రామమైన మోటుపల్లి వచ్చారు. ఉదయం స్నానం చేసేందుకు బాత్‌రూంలోకి కాశమ్మ వెళ్లింది. బాత్‌రూం రేకులకు విద్యుత్ సరఫరా కావడంతో కాశమ్మ చెయ్యి తగిలి విద్యుదాఘాతానికి గురై పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆటోలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే కాశమ్మ మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతురాలికి భర్త ఆవులయ్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంతోషంగా గుర్రప్పడి పూజలు చేసుకోవాల్సిన గ్రామంలో కాశమ్మ మరణంతో విషాదచాయలు అలముకున్నాయి. ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

20 గొర్రెల అపహరణ


గొర్రెల మంద


వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు వెంకటేశ్వర్లు

పొదిలి: గొర్రెల మంద నుంచి సుమారు 20 గొర్రెలను అపహరించిన సంఘటన శుక్రవారం రాత్రి పొదిలి నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెంలో జరిగింది. బాధితుడు సన్నెబోయిన వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. 100 గొర్రెలను దొడ్డిలోని మందలో ఉంచి వెంకటేశ్వర్లు ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో దొంగలు మందలోకి చొరబడి సుమారు రూ.3.5 లక్షల విలువ చేసే 20 గొర్రెలను అపహరించుకుపోయారు. గొర్రెల పెంపకంతోనే ఉపాధి కొనసాగిస్తున్న తమకు అన్యాయం జరిగిందని వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులు వాపోయారు. గొర్రెలను దొంగిలించిన వారిని పట్టుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.


ఒంగోలులో మంచులో ప్రమాదకరస్థితిలో ప్రయాణం





ఒంగోలులోని దక్షిణ బైపాస్‌లో కురుస్తున్న మంచు

భలే మంచు రోజు..!

జిల్లాను పొగ మంచు కమ్మేసింది. చలి పులి పంజా విసిరింది. ప్రజలను గజగజా వణికించింది. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మొన్నటి వరకూ వర్షాలు ముంచెత్తాయి. కాస్త తెరిపిచ్చాయనుకునేలోపే శనివారం పొగ మంచు దుప్పటిలా కప్పేసింది. ఉదయం 9 గంటల వరకూ లైట్లు వేసుకున్నప్పటికీ రోడ్డు కనిపించక వాహనదారులు అవస్థపడ్డారు. రైళ్ల రాకపోకలకు సైతం అసౌకర్యం కలిగింది. ప్రకృతి ప్రేమికులు మాత్రం మంచును ఆస్వాదించారు. భలే మంచు రోజు అనుకుంటూ ఫొటోలు తీసుకున్నారు. – కంభం


మంచులోనే స్కూలుకు వెళ్తున్న విద్యార్థులు


ఒంగోలు నగరాన్ని కమ్మేసిన పొగ మంచు




అతికష్టంమీద రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనచోదకులు


మంచుతో నిండిపోయిన ఒంగోలు రైల్వేస్టేషన్


మంచులోనే వాకింగ్ చేస్తున్న ప్రజలు




కంభంలో అనంతపురం-అమరావతి హైవేపై మంచు


కంభం రైల్వేస్టేషన్..


కంభంలోని మార్కాపురం రోడ్డు..

సైనికుల సేవలు గర్వకారణం


మాజీ సైనికులకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా


కలెక్టర్‌కు విరాళం అందిస్తున్న కంభం మాజీ సైనికులు

- దేశం కోసం వారి త్యాగాలు మరువలేనివి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: దేశ రక్షణలో సైనికుల సేవలు ప్రతిఒక్కరికీ గర్వకారణమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కుటుంబాలను, ప్రాణాలను సైతం త్యాగం చేసి దేశం కోసం, దేశ ప్రజల కోసం వారు నిర్వర్తించే సేవలను ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. శనివారం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ సైనికులు, సైనిక శాఖాధికారులు కలెక్టర్‌ను కలిసి పతాక దినోత్సవ బ్యాడ్జి అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన మొదటి విరాళాన్ని హుండీలో వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి అధిక మొత్తంలో నిధులు సేకరించిన మాజీ సైనిక సంఘ నాయకులకు, సభ్యులకు జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ నిధికి ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సైనిక సంక్షేమ అధికారి రజనీకుమారి, లెఫ్టినెంట్ కల్నల్ క్రుపావల్లీ, కెప్టెన్ పార్వతమ్మ, సైనిక సంఘ మాజీ అధ్యక్షుడు నెప్పల్లి నాగేశ్వరరావు, సెట్టెం వేణుగోపాల్, కేసీహెచ్ పుల్లయ్య, ఎస్.ఓబులేసు, పాండు, రామకృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

కంభం మాజీ సైనికుల విరాళం

కంభం: సాయుధ దళాల పతాక నిధికి కంభం మండల మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో రూ.78,000 విరాళం అందజేశారు. శనివారం ఒంగోలులో జరిగిన సాయుధ దళాల పతాక నిధి 2024 వేడుకల్లో కలెక్టర్‌కు అందించారు. గత పదేళ్లుగా రికార్డు స్థాయిలో విరాళాలు సేకరించి అందిస్తున్న కంభం మాజీ సైనికులను జెడ్ఎస్‌డబ్ల్యూఓ ఎం.రజనికుమారి అభినందించారు. మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు శెట్టం వేణుగోపాల్, అంకయ్య గౌడ్, పుల్లయ్య, సంకతాల ప్రసాద్, మస్తాన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

కంభంలో దొంగల హల్‌చల్


అర్బన్ కాలనీలో చోరీ జరిగిన దుకాణంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం


తర్లుపాడు రోడ్డులో చోరీ జరిగిన దుకాణం


తాళాలు పగలగొట్టి ఉన్న వెల్డింగ్ షాపు

- చిల్లర దుకాణాల్లో రూ.48,500 నగదు, సరుకులు అపహరణ

కంభం: పట్టణంలో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మూసివేసి ఉన్న దుకాణాలను టార్గెట్ చేసుకుని నగదు, సరుకులు, వస్తువులు ఎత్తుకెళ్లారు. స్థానిక అర్బన్ కాలనీలోని సయ్యద్ మహబూబ్ దుకాణం తాళం పగలగొట్టి రూ.40 వేల నగదు, దుకాణంలోని కొన్ని వస్తువులు అపహరించారు. కందులాపురం పంచాయతీ పరిధిలోని తర్లుపాడు రోడ్డులో గల ఓ చిల్లర దుకాణం తాళం పగలగొట్టి రూ.8,500 నగదు, ఫ్రిజ్‌లో ఉన్న కూల్‌డ్రింక్స్, ఇతర వస్తువులు అపహరించుకెళ్లారు. దానిపక్కనే ఉన్న అల్లూరయ్యకు చెందిన వెల్డింగ్ షాపు తాళం కూడా పగలగొట్టి ఉంది. వెల్డింగ్ షాపు యజమాని వస్తేగానీ అక్కడ ఏమేంపోయాయో తెలియాల్సి ఉంది. అర్బన్ కాలనీలో చోరీ జరిగిన సమీపంలో రెండు ద్విచక్రవాహనాల పైపులు పీకేసి పెట్రోలు కూడా తీశారు. శనివారం ఉదయం మార్కాపురం క్లూజ్ టీం సభ్యులు సంఘటన స్థలాలను పరిశీలించి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

తల్లిదండ్రులను తప్ప ఎవరినీ నమ్మొద్దు

- ఆడపిల్లలకు ఎస్పీ దామోదర్ సూచన


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: కనిపెంచిన తల్లిదండ్రులను తప్ప మరెవరినీ ఆడపిల్లలు నమ్మొద్దని, నమ్మి మోసపోవద్దని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. సమాజంలో జరుగుతున్న ఘోరాలు, నేరాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నగరంలోని దోనేపూడి రాఘవరావు మెమోరియల్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రసంగిస్తూ ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయరాదని, ఆర్థికంగా వారు స్థిరపడిన తర్వాతే వివాహాలు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. మైనర్ బాలికలు, మహిళలు వయసుతో నిమిత్తం లేకుండా మానవ మృగాల మాయలో పడి బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా పాఠశాలలు, కళాశాలల్లో పోలీసు అధికారులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆడపిల్లలు, మహిళలకు సంబంధించిన సమస్యలపై పోలీసులు చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌ను మితిమీరి ఉపయోగించవద్దని, ఫోన్లో అనవసరమైన విషయాల జోలికి వెళ్లవద్దని చెప్పారు. సైబర్ నేరాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని, మాదక ద్రవ్యాలను దగ్గరకు రానియవద్దని చెప్పారు. ఒకసారి డ్రగ్స్ కేసులో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందలేరని స్పష్టం చేశారు. సాటి విద్యార్థులు, ఆడపిల్లలతో బాధ్యతగా మెలగాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడా నైపుణ్యాలు పెంచుకుని మానసిక వికాసంతో ఆరోగ్యంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అమ్మకం, వినియోగం గురించి ఏదైనా సమాచారం ఉంటే 1972 నంబర్‌కు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, డీఆర్ఆర్ఎం హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిపాయల లోడు వాహనం బోల్తా


వాహనం బోల్తాపడి రోడ్డుపై పడిపోయిన ఉల్లిపాయల బస్తాలు

కంభం: మండలంలోని జంగంగుంట్ల గ్రామ సమీపంలోని అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై ఉల్లిపాయల లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనలో డ్రైవర్ నబి రసూల్‌తో పాటు మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. గాయపడిన వారిని 108 వాహనంలో కంభం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నంద్యాల నుంచి వినుకొండకు ఉల్లిపాయల లోడు తరలిస్తుండగా వేగంగా వెళుతున్న బొలెరో వాహన యాక్సిల్ విరిగిపోవడంతో వాహనం నుంచి టైర్ విడిపోయి అదుపుతప్పి బోల్తా పడినట్లు డ్రైవర్ తెలిపాడు. రోడ్డు ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి మహిళ మృతి

టంగుటూరు: ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదానికి గురై అందులో ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందిన సంఘటన టంగుటూరు మండలంలో మల్లవరప్పాడు-కారుమంచి గ్రామాల మధ్య శనివారం చోటుచేసుకుంది. బెజవాడ వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వ్యవసాయ కూలి పనుల నిమిత్తం తన స్వగ్రామం సూరారెడ్డిపాలెం నుంచి సుమారు 20 మంది కూలీలను ట్రాక్టర్‌లో కారుమంచి గ్రామానికి తీసుకెళ్లాడు. సాయంత్రం పనులు ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో బెజవాడ వెంకటేశ్వర్లు భార్య బెజవాడ ధరణి (30) మృతి చెందింది. ట్రాక్టర్లోని పలువురు కూలీలకు కూడా స్వల్ప గాయాలవగా, చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అనంతరం జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీశారు.